# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## విజయ్ గోపాల్ వారి గంగా గౌరీ సంవాదం
## (చిత్రసీమ 1957 నవంబర్ సంచిక నుంచి)

**సెట్స్ మీద ఒకరోజు:**



"టేకింగ్ ప్లీజ్! సైలెన్స్!.. అమ్మా! ఏక్షన్" అన్నాడు దర్శకుడు వి.యస్. రెడ్డి.

"ఆల్ లైట్స్" అన్నాడు ఆపరేటివ్ కెమెరా మెన్ వర్మ. సెట్ అంతా – చక్కని వెలుగు నీడలతో కన్నులకి ఇంపయిపోయింది.

"క్లాప్" అన్నదే తడవుగా సుందరరామరెడ్డి క్లాప్ కొట్టి వెళ్ళిపోయాడు.

ఆ విశాలమయిన గదిలో ఉన్న పందిరి మంచం మీద పడి గంగ ఏడుస్తోంది. అంతలోనే ఆమె తల్లి చక్రదేవమ్మ తల్లడిల్లిపోతూ ఆవేదనాభార హృదయంతో కంపించిపోతూ "అమ్మా! అమ్మా! ఏమిటమ్మా ఇది?" అంటూ కూతురు తల నిమురుతుంది.

"ఊళ్ళోవాళ్ళు నన్నింక బ్రతకనిచ్చేటట్టు లేరమ్మా! చెప్పు చెప్పు నిజం చెప్పూ అని చెప్పేదాకా ప్రాణాలు తీసేశావు. ఇవాళ ఊళ్ళో ఎక్కడ చూసినా నా గొడవే చెప్పుకుంటున్నారు. చిట్టచివరకి నా మొహం మీదే అనేస్తున్నారమ్మా" అంటూ ఏడుస్తూ కూర్చుంటుంది.

చక్రదేవమ్మ గుండె తరుక్కుపోతుంది.

"అయ్య వాళ్ళమ్మ కడుపు కాలిపోనూ! వాళ్ళకేం వినాశ కాలమే నా తల్లీ? ఊళ్ళో వాళ్ళెవళ్ళ గొడవకైనా మనం కలగజేసుకున్నామా? ఇవాళ ఊళ్ళోవాళ్ళందరికీ మన గొడవే కావలసి వచ్చిందా?"

"వదినా" అంటూ రుద్రమ్మ ఆ గదిలోకి వచ్చేస్తుంది.

ఆమెను చూడగానే మరీ రెచ్చిపోతుందా తల్లి చక్రదేవమ్మ.

"వచ్చావా? మేమెల్లా కుళ్ళి ఏడుస్తున్నామో నువ్వు వేడుగ్గా చూడాలనే వచ్చావా వదినా?" అనేస్తుంది చాలా కరుకుగా.

పాపం రుద్రమ్మ ఎంతో దిగాలుపడి పోతుంది. కృంగిపోతుంది. "అయ్యో నా ఖర్మం కాలిపోనూ" అని నిర్విణ్ణురాలే అయిపోతుంది.

"చాల్చాల్లే వదినా? ఇన్నాళ్ళూ గుమ్మంలోకి రానిదానివి ఇవ్వాళొచ్చావంటే ఎందుకో వేరే చెప్పాలా?" ధుమ ధుమధుమలాడిపోతూ గంగ చెయ్యి పట్టుకుని మంచంమీంచి లాగేస్తూ "రామ్మా రా! ఇంక ఈ యింట్లో బ్రతకలేం. ఏ నుయ్యో ఏ గొయ్యో చూసుకుందాం. రామ్మా రా" అంటూ తల్లి చక్రదేవమ్మ కూతురు గంగని – ఒక ఆవేశంలో పడి, ఉద్రేకంగా లాక్కుపోతుంది.

కడుపు చెరువైపోతుంది రుద్రమ్మకు. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. అపవారిస్తూ "వదినా! వదినా! వదినా" అంటూ వెనకాలే వెడుతుంది.

"కట్. ఒ.కె" అన్నాడు – వి.యన్.

ఇదంతా ఒకటే షాట్ అయినా నటీమణులు ముగ్గురూ బ్రహ్మాండంగా నటించారు. ఇంత షాట్‌నీ చక్కగా "టేక్" చేశాడు వి.యన్.రెడ్డి.

ఈ సన్నివేశం 'గంగా గౌరీ సంవాదం'లోనిది. శివ దేవుణ్ణి పెళ్ళాడి, కాపురానికి కైలాసం వెళ్ళిన గంగాదేవి, సవతికి ప్రాధాన్యత నివ్వడమూ, ఆమె ముందే భర్త తనని నిర్లక్ష్యించడమూ జరుగుతుంది. సవతి మత్సరంతో, అవమానంతో, ఆవేదనతో ఆక్రోశిస్తూ గంగ పుట్టింటికి వచ్చేస్తుంది. స్త్రీ సహజమైన అహంభావంతో తాను సుఖంగానే ఉన్నాననీ, కేవలం తలిదండ్రుల్ని చూడ్డానికే వచ్చాననీ అబద్ధాలు చెప్తుంది గంగ. ఎంతకాలం ఈ రహస్యం దాగుతుంది? నోరుముయ్యగలం కాని లోకం నోరు ముయ్యగలమా? నీళ్ళు తేబోయిన గంగ చెవిలో పడేటట్లే మాటలాడతారు. పలుగాకులుగా లోకులు.

ఆ మాటలు విని వచ్చి భరించలేని దుఃఖంతో మంచం మీద పడుకుని ఏడుస్తుందన్న మాట గంగ.

గంగ సంసారం మూణ్ణాళ్ళ ముచ్చటే అయిపోయిందన్న వార్త. గంగ మేనత్త రుద్రమ్మ చెవిని పడతాయి నీలాటి రేవులో. అక్కడో క్షణం అయినా నిలబడలేక పోతుందామె.

వాళ్ళ బాధ పంచుకుందామన్న ఉద్దేశంతోనే వస్తుంది పాపం రుద్రమ్మ. ఆవేశంలో పడివున్న చక్రదేవమ్మ – రుద్రమ్మని పట్టుకుని ఝాడించి వదిలేస్తుంది.

గంగని చూస్తే దెబ్బ తిన్న లేడిలా కనిపించింది. చక్రదేవమ్మ ఈనిన పులిలా ఉంది. దిగాలు పడిపోయిన రుద్రమ్మని చూస్తే పాపం అనిపిస్తుంది. భర్త పోయాడు. ఆశలన్నీ పెట్టుకుని పెద్ద చేసుకున్న కొడుకు, జోగీ సన్నాసీ కూడా కాకుండా పోయాడా? వంశవృక్షం ఆమె కళ్ళ ముందే ఎండిపోతుందా?

ఈ సన్నివేశం చిత్రీకరించబడ్డది గంగ పుట్టింట్లో. ఈ సెట్‌ని చాలా చక్కగా వేశారు. ఒక్క పూజాగది, పడకగది, ఒక హాలు ఉన్నాయి ఇందులో.

"ఈ సెట్‌లో తియ్యబడ్డ ప్రతి సన్నివేశమూ ఆడిటోరియంని ఊపాలి మరి. మీకు కవిగారు తెలియదూ? పరుశురాంగారు అంత బాగా వ్రాశారు" అంటూ వి.యన్ నాకు పరుశురాం గారిని పరిచయం చేశారు.

మంచి "టీం" వర్కూ, క్విక్ వర్కూ, వ్యక్తుల్లో మంచి హుషారూ కనిపించాయి నాకు. త్వరలోనే ఈ చిత్రం పూర్తయిపోవచ్చుననుకుంటాను.

Post your comments